నేటి నుంచి జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణా శిబిరాలు

- అతి తక్కువ ఫీజు.. నిష్ణాతులైన శిక్షకులు
- 45 రోజుల పాటు 31 క్రీడాంశాల్లో విద్యార్థులకు శిక్షణ


ఖైరతాబాద్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు(ఫైల్)

ఖైరతాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు పిల్లలు చిన్నప్పటి నుంచే ఇష్టమైన క్రీడలో శిక్షణ పొంది వాటిలో రాణించేలా చేస్తే ఆరోగ్యంతోపాటు అన్నిరంగాల్లో ముందుంటారనే ఉద్దేశ్యంతో జీహెచ్‌ఎంసీ ప్రతి యేటా వేసవి సెలవుల్లో పిల్లలకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోంది. దాదాపు 45 రోజులపాటు సాగే ఈ శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు తమకిష్టమైన క్రీడలో చేరి వారి ప్రతిభ చూపిస్తే అదే క్రీడలో చదువుతూనే కొనసాగేలా ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉంది. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు సైతం ఉంటాయి. ఎంతోమంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి రాణిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఆధ్వర్యంలో దాదాపు అన్ని క్రీడా కాంప్లెక్స్‌లలోనూ, ప్రభుత్వ ఆటస్థలాల్లోనూ వేసవి శిక్షణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి జీహెచ్‌ఎంసీకి చెందిన 114 క్రీడా మైదానాల్లో శిబిరాలను ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

31 క్రీడాంశాల్లో శిక్షణ

వేసవి శిబిరాల్లో ఆటస్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో స్థలం, అవకాశాలను బట్టి ఆయా క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో బాక్సింగ్, బాస్కెట్‌బాల్, బాడీ బిల్డింగ్, స్విమ్మింగ్, షెటిల్, బాడ్మింటన్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్, హాకీ, హ్యాండ్ బాల్, మల్కంబ, కరాటే, ఖో-ఖో, కోర్ఫ్ బాల్, కబడ్డీ, కిక్ బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్, రోలర్ స్కేటింగ్, సెపక్ టక్రా, సాఫ్ట్ బాల్, స్వేమార్షల్ ఆర్ట్స్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్, వాషు, యోగా క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. వీటికోసం 45 రోజుల శిక్షణకుగాను స్విమ్మింగ్ కోసం రూ.500, షెటిల్ బాడ్మింటన్, క్రికెట్‌కు రూ.50ఫీజును, ఇతర అన్నింటికీ కేవలం రూ.10 నామమాత్రపు ఫీజుగా చెల్లించి పేర్లను నమోదు చేసుకునే సదుపాయం జీహెచ్‌ఎంసీ కల్పించింది. ఈ శిక్షణల కోసం 22 మంది తాత్కాలిక కోచ్‌లు, ఇప్పటికే పని చేస్తున్న గౌరవ కోచ్‌లను వినియోగిస్తున్నామని అధికారులు తెలిపారు. మెహిదీపట్నం సర్కిల్‌లో 13 క్రీడాంశాలు, కార్వాన్ సర్కిల్‌లో 14, గోషామహల్‌లో 24, ఖైరతాబాద్ సర్కిల్‌లో 20, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 12 క్రీడల్లో శిక్షణ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు..

వేసవి శిక్షణా శిబిరాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రవేశాలను పొందవచ్చని అధికారులు తెలిపారు. 'స్పోర్ట్స్ డాట్ జీహెచ్‌ఎంసీ డాట్ జీవోవి డాట్ ఇన్' వెబ్‌సైట్‌లోకి వెళ్లి పిల్లలు ఇష్టమైన క్రీడలో శిక్షణకోసం పేర్లను నమోదు చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. శనివారం ఉదయం కోఠిలోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో వేసవి శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ శిబిరాలు ఉంటాయపేర్కొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి..



కేవలం నామమాత్రపు రుసుముతో ఇస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలి. మా జోన్‌లో ఉన్న 144 ఆటస్థలాలు, మైదానాల్లో ఈ శిబిరాలను దాదాపు అన్నింట్లో నిర్వహిస్తున్నాం. పిల్లలు చదువుతోపాటు ఏదైనా ఇష్టమైన ఆటలో శిక్షణ పొందితే వారు మానసికోల్లాసాన్ని పొందుతారు. ఆరోగ్యం బాగుంటేనే చదువులో రాణిస్తారు. అన్ని శిక్షణ శిబిరాల్లో శిక్షకులను సిద్ధం చేశాం. మీమీ సమీప ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఇష్టమైన ఆటల్లో చేరండి.

- రహీనాబేగం, అదనపు డైరెక్టర్, స్పోర్ట్స్ విభాగం, ఖైరతాబాద్ జోన్


సనత్‌నగర్ డివిజన్‌లోని స్వామి టాకీస్ చౌరస్తాలో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు వెల్లాల రామ్మోహన్, సుబ్బారావు, రవిచంద్ర, అనురాధ తదితరులు


కేబీఆర్ పార్కు నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రతినిధులు



ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో జరిగిన శాంతి ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ యువజన విభాగం మాజీ అధికార ప్రతినిధి పీపీ రవిశేఖర్‌రెడ్డి


ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ అచ్చయ్య చౌరస్తాలో ఉగ్రదాడిని నిరసిస్తూ నివాళులర్పిస్తున్న స్థానికులు


పెహల్గాం మృతులకు సంతాపంగా ఖైరతాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన శివాజీ యూత్ క్లబ్ ప్రతినిధులు మహేందర్‌బాబు, తదితరులు


బోరబండలో నిర్వహించిన శాంతిర్యాలీలో మహిళా కాంగ్రెస్ నాయకులు హబీబా సుల్తానా, వివిధ బస్తీల నాయకులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో మంచి భవిష్యత్తు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి వివరిస్తున్న అధ్యాపకులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని పలువురు అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడ నాగార్జునకాలనీ శారదా మహిళా కళాశాలలో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ఏఐని నేర్చుకోవడం, ఏఐ ఉపయోగం, విశిష్టతపై వారు అవగాహన కల్పించారు. ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ఏఐని కూడా భాగం చేసుకొని విద్యను సులభతరం చేసుకోవాలని కళాశాల పిన్సిపాల్ భాస్కర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పవన్, మాధవి, అంజన, శ్రీవల్లి పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేత


వినాయక్‌నగర్‌లో నిర్మించిన ఇంటిని కూల్చిన రెవెన్యూ సిబ్బంది

బోరబండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ప్రధాన రహదారిపై వినాయక్‌నగర్‌లో అనుమతి లేకుండా నిర్మించిన ఇంటిని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. నిర్మాణంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయగా, ఇల్లు, ఇంటి ప్రహరీ గేటుకు జీహెచ్‌ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఇటీవల తాళాలు వేసిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కూల్చివేత జరిపినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న కవితారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాంచందర్ పాల్గొన్నారు.


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంగీతాయాదవ్

మురుగు సమస్యను పరిష్కరించండి

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలోని నాగార్జునకాలనీ విజయ టవర్స్, రామకృష్ణ టవర్స్ కమ్మ సంఘం, నిలయ అపార్ట్‌మెంట్ కాలనీల్లో కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు శుక్రవారం వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా ఇమేజ్ ఆస్పత్రి నుంచి బిగ్ బజార్ వరకు మెయిన్ రోడ్డులో ఉన్న పైప్‌లైన్‌లో జామ్ కావడంతో నాగార్జున కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. సమస్య పరిష్కారం కోసం రూ.50 లక్షలు కేటాయించాలని కోరారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు మొదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.


చిన్నారులకు కానుకలు అందిస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

సందడిగా గ్రాడ్యుయేషన్ డే

బోరబండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఎస్.ఎస్.బి.నగర్ అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం సందడిగా జరిగాయి. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సెంటర్ టీచర్లు అరుణ, ధనలక్ష్మి, అనిత, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 11కేవీ న్యూ శాస్త్రి నగర్ ఫీడర్ పరిధి, ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు 11కేవీ దుర్గా నగర్ ఫీడర్ పరిధి, ఉదయం 9 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు 11కేవీ హెచ్‌పీ రోడ్ ఫీడర్ పరిధి, ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు 11కేవీ జాఫర్ అలీ బాగ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు 11 కేవీ పాటిగడ్డ, భరత్‌నగర్ ఫీడర్ల పరిధి, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డి.ఎ న్.ఎం కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

కురుక్షేత్ర-2025 క్రీడా పోటీలు ప్రారంభం



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ అశోక్

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల విద్యార్థుల్లో మానసికకఉల్లాసంతో పాటు నిర్ణయాత్మకమైన జీవనశైలి, క్రియాశీలత, ఏకాగ్రత పెరుగుతుందని నార్త్ జోన్ అడిషనల్ డీసీపీ పి.అశోక్ అన్నారు. బంజారాహిల్స్‌లోని జేఎన్‌ఐఏఎస్ (జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్) ఆర్కిటెక్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కురుక్షేత్ర ఆటల పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణను సైతం తీసుకురావడంతో పాటు చదువుల్లో కూడా రాణించేందుకకు దోహదపడతాయని అన్నారు. జేఎన్‌ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ మాట్లాడుతూ ఇది కురుక్షేత్ర 9వ ఎడిషన్ అని ప్రతియేటా క్రీడా పోటీలతో పాటు ఫ్యాషన్ డిజైనింగ్, జర్నలిజం, డిజైనింగ్, ఫొటోగ్రఫీ రంగాల్లో కూడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడాపోటీల్లో తెలంగాణలోని అన్ని ఆర్కిటెక్ కాలేజీల విద్యార్థులు పాల్గొంటారని ఆదివారం ముగింపు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ట్రోఫీని అడిషనల్ డీసీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ గోపాలకృష్ణ, సినీ సంగీత దర్శకుడు కె.నిహాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాభవన్ ప్రజావాణికి 291 దరఖాస్తులు


ప్రజావాణికి వచ్చిన గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులు


గిరిజన శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్

బేగంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 291 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సకాలంలో జీతాలు చెల్లించడం లేదని పలువురు గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు, గిరిజన శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాభవన్‌లోని ప్రజావాణి అధికారి దివ్యదేవరాజన్‌ను కలిసి విన్నవించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 123, విద్యుత్ శాఖ 17, రెవెన్యూ 38, ఇందిరమ్మ ఇళ్ల కోసం 61, ప్రవాసి ప్రజావాణికి 1, ఇతర శాఖలకు చెందిన 51 దరఖాస్తులు అందినట్లు దివ్య దేవరాజన్ తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలి


టెక్నో-మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ప్రారంభోత్సవంలో శశికాంత్, డీఆర్డీఎల్ శాస్త్రవేత్త శంకరి తదితరులు

పంజాగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శశికాంత్ సూచించారు. పంజాగుట్ట అరోరా కాలేజీలో అనుకృతి-2025 పేరిట ఏర్పాటు చేసిన టెక్నో-మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను శుక్రవారం డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ(డీఆర్డీఎల్) శాస్త్రవేత్త శంకరి, కాలేజీ ప్రిన్సిపాల్ సుష్మ, ప్రదేశ్ చంద్ర పట్నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యం కలిగిన విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. ఫేస్ బుక్‌తో కాదు పుస్తక పఠనంతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని అన్నారు. సాంకేతికత పరుగులు తీస్తున్న వేళ సృజనాత్మకత, మేనేజ్‌మెంట్ అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగిన వారే ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకోగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ శ్రీదేవి, ఎంబీఏ హెచ్‌ఓడీ అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరు మోసిన దొంగ అరెస్ట్

- 9.8 తులాల బంగారు నగలు.. బైక్ స్వాధీనం
- ఇళ్లలో ఒంటరి మహిళలే టార్గెట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రష్మిక పెరుమాళ

బేగంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో ఉండే ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న పేరుమోసిన దొంగను బేగంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 9.8 తులాల బంగారు నగలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, డీఐ మధుతో కలిసి నార్త్‌జోన్ డీసీపీ రష్మిక పెరుమాళ్ వివరాలను వెల్లడించారు. తిరుపతిలోని మధురానగర్‌కు చెందిన పాపాని క్రాంతికుమర్ చిన్న,చిన్న వ్యాపారాలు చేసేవాడు. జల్సాలు, జూదానికి అలవాటుపడడంతో డబ్బులు సరిపోక చోరీలు చేయడం ప్రారంభించాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 14 చోట్ల ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి తిరిగి వచ్చి దొంగతనాలకు పాల్పడేవాడు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా సీబీ షైన్ బైక్‌ను కాజేశాడు. దీనిపై పలు ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరి మహిళలు ఉండే ఇళ్లను దొంగతనాల కోసం ఎంచుకునేవాడు. ప్రధానంగా వృద్ధులు ఉన్న ఇళ్లను ఎంచుకుని ఇంట్లోకి చొరబడి వారి మెడలోని బంగారు గొలుసులను తెంపుకొని ఉడాయించేవాడు. అద్దె ఇంటి కోసం వెతుకుతున్నట్లు నటిస్తూ ఎంచుకున్న ఇంట్లోకి ప్రవేశించి వారితో మాట్లాడుతూనే వారి మెడలోని బంగారు గొలుసు తెంచుకొని పారిపోయేవాడు. ఈనెల 17వ తేదీన బేగంపేట మయూరి మార్గ్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న కమల అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంచుకుని పారిపోయాడు. దీంతో బాధిత మహిళ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ద్వారా పరిశీలించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు రికవరీ చేశారు.



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

టెకీ బ్యాగ్‌లో నగదు చోరీ

అమీర్‌పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బ్యూటీ పార్లర్‌కు వెళ్లిన ఓ మహిళ బ్యాగ్‌లోని రూ.25వేలు చోరీ అయ్యాయి. ఈ ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన కె.దివ్య(37) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అమీర్‌పేట్‌లోని రిలయన్స్ బ్యూటీ సెలూన్, వెయిట్ లాస్ సెంటర్‌కు వెళ్లారు. పార్లర్‌కు వెళ్లే ముందు ఆమె బ్యాగ్‌లో రూ.50వేలు ఉన్నాయి. దారిలో ఆమె పంజాగుట్టలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.25 వేలు డిపాజిట్ చేసింది. బ్యాగ్‌లో రూ.25 వేలు తీసుకుని వెళ్లింది. పార్లర్ సోఫాలో ఎప్పటిలాగే ఉంచి కాసేపటి తర్వాత వెళ్లిపోయారు. పార్లర్‌లోనే తన బ్యాగ్‌లో ఉన్న రూ.25 వేలు కాజేశారని, పార్లర్‌కు నెగిటివ్ రివ్యూలే ఎక్కువగా ఉన్నాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్లర్ నిర్వాహకురాలికి ఫోన్ చేస్తే ఆమె అసభ్యకరంగా దూషించిందని.. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టంపై రిట్ పిటిషన్

పంజాగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ షెడ్యూల్డ్ కులాల(రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం-2025ను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ తీర్పు ప్రకారం షెడ్యూల్డ్ కులాలలోని కొన్ని సమూహాల వెనుకబాటుతనం ఆధారంగా సరిపోని ప్రాతినిధ్యాన్ని ప్రదర్శించే ఎంపరికల్ డేటాను సేకరించి అందించడంలో రాష్ట్రం విఫలమైందని ఆయన ఆరోపించారు.



బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన కార్పొరేటర్ వెంకటేష్

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

బంజారాహిల్స్/పంజాగుట్ట/బేగంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. వరంగల్ సభ పోస్టర్‌ను ఫిలింనగర్‌లో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్వయంగా ఆటోలకు అంటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీక్షను చేపట్టి తెలంగాణ తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం బీఆర్ఎస్‌ను స్థాపించారని ప్రజలు కూడా అంతే ప్రేమతో పార్టీని అక్కున చేర్చుకున్నారని తెలిపారు. వరంగల్ సభకు వచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. మధురానగర్‌లోని కార్పొరేటర్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో కార్పొరేటర్ దేదీప్య మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ శ్యామ్‌ముదిరాజ్, నాయకులు విజయ్ ముదిరాజ్, వేణుగోపాల్, ఎ.రామకృష్ణ, ఆంజనేయులు యాదవ్, సత్యనారాయణ, పవన్ ముదిరాజ్, గజ్జల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ తెలిపారు. బేగంపేటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీహరి, రఘునాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య

యువకుడి ఆత్మహత్య

పంజాగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాలనుకుని ఇంట్లో వారిని డబ్బులు అడిగాడు ఓ యువకుడు. ప్రస్తుతం డబ్బులు లేవు సర్దుబాటు చేసి ఇస్తామని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్ (23) ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లాలని అనుకున్నాడు.నాలుగు రోజులుగా ఇంట్లో వారిని డబ్బులు అడుగుతున్నాడు. రెండు, మూడు రోజుల్లో సర్దుబాటు చేసి ఇస్తామని కుటుంబసభ్యులు చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గిరిజన శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్

ప్రజాభవన్ ప్రజావాణికి 291 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 291 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలకు సంబంధించి అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి సకాలంలో జీతాలు చెల్లించడం లేదని పలువురు నోడల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు, గిరిజన శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 123, విద్యుత్, 17, రెవెన్యూకు 38, ఇందిరమ్మ ఇండ్ల కోసం 61, ప్రవాసి ప్రజావాణికి 1, ఇతర శాఖలకు చెందిన 51 దరఖాస్తులు అందినట్లు అధికారి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్

అంబేడ్కర్, జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

తార్నాక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తార్నాకలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్)లో శుక్రవారం బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ.మొలుగారం కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొలుగారం కుమార్ మాట్లాడుతూ, అంబేడ్కర్ దేశ నిర్మాణంలో శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యతనిచ్చారని, విద్య, ఆరోగ్యం ద్వారా మాత్రమే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని ఆయన గాఢంగా నమ్మారని తెలిపారు. అదేవిధంగా జగ్జీవన్‌రామ్ ఆహార భద్రతను కేవలం శాస్త్రీయ అంశంగా కాకుండా మానవ హక్కుల అంశంగా భావించారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య, ఎన్‌ఐఎన్ డైరెక్టర్ భారతి కులకర్ణి, ఎన్‌ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త భాను ప్రకాష్ రెడ్డి, ఎన్‌ఐఎన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యపాల్, జనరల్ సెక్రటరీ ఎస్. లక్ష్మణ్ పాల్గొన్నారు.



బోయినపల్లి న్యూసిటీ కాలనీ మూలమలుపులో పాడైన స్లాబ్‌ను పరిశీలిస్తున్న జంపన ప్రతాప్

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి : ప్రతాప్

బోయినపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డుకు వచ్చే ఆదాయ వనరులే కాక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌తో సహ ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, శానిటేషన్ విభాగం అధికారులు దృష్టిసారించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఒకటవ వార్డు పరిధిలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్య సమాజ్ వద్ద పవర్‌బోరుకు ఆరు నెలల క్రితం నూతన విద్యుత్ మోటార్ బిగించారు.. కానీ పైపులైన్ కనెక్షన్ ఇవ్వకుండా ఆరు నెలలుగా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ హాస్పిటల్ వద్ద బోర్‌వెల్ మరమ్మతులు చేయగా తర్వాత పైపులు తీసి పక్కన పెట్టారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సీఈవో, వివిధ అధికారులను ప్రతాప్ డిమాండ్ చేశారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ

బేగంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చరిత్రలో నిలిచిపోయేలా ఈనెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బేగంపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బేగంపేటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బోయగూడలో...

పద్మారావునగర్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. బోయగూడలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు రజతోత్సవ సభ పోస్టర్‌ను ప్రదర్శించి ప్రతిజ్ఞ చేశారు.

సికింద్రాబాద్‌లో...

సికింద్రాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకున్న భ్రమలు తొలగిపోయాయని, బీఆర్ఎస్ పాలనను మళ్లీ కోరుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్, బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో దేవులపల్లి శ్రీనివాస్, కుమార్‌ముదిరాజ్, శ్యాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో...

అడ్డగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి కార్యకర్తలు అభిమానులకు పిలుపునిచ్చారు. సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరుతూ అడ్డగుట్టలో గోడలకు పోస్టర్లను ఆవిష్కరించారు.

మెట్టుగూడలో...

చిలకలగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. డివిజన్ బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

పారిశుధ్యం.. అధ్వానం

రహదారుల్లోనే రాళ్లు, మట్టి, ఇసుక డంప్ ● సనత్‌నగర్, ఎస్ఆర్‌టీ కాలనీల్లో ఎటు చూసినా వ్యర్థాలే



ఎస్ఆర్‌టీ భగత్ సింగ్ పార్క్ రహదారిలో డంప్ చేసిన భవన వ్యర్థాలు



రవీందర్‌నగర్ కాలనీలో రోడ్డును తవ్వి కుప్పగా పోసిన రాళ్లు, మట్టి



జెక్ కాలనీలో ఫుట్‌పాత్‌పై డంప్ చేసిన భవన వ్యర్థాలు

బేగంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీ పార్కులకు నిలయంగా ఉంటోంది. ఈ కాలనీలో పదుల సంఖ్యలో పార్కులు ఉంటాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్స్ ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా పార్కుల్లో సేదతీరుతుంటారు. అయితే ప్రస్తుతం ఈ కాలనీ రహదారులు భవన నిర్మాణాల వ్యర్థాలకు నిలయంగా మారాయి. ప్రధానంగా ఇళ్లు నిర్మించుకునే వారు పాత ఇంటిని తొలగించినప్పుడు ఆ వ్యర్థాలను లారీల ద్వారా తరలించాలి. కానీ ఇక్కడ ఏ రోడ్డుపై చూసినా ఇళ్ల నిర్మాణం చేసేవారు రోడ్డు పక్కన, రోడ్డు మధ్యలో వ్యర్థాలను కుప్పలుగా పోస్తున్నారు. దీని వల్ల వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల్లో నిర్మాణాల వ్యర్థాలను డంప్ చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో నెలల తరబడి అవి రోడ్డుపైనే ఉండడంతో ప్రజల రాక పోకలకు అంతరాయంగా మారుతున్నాయి. వీటికి తోడు రహదారుల్లో తీవ్ర పారిశుధ్య సమస్య నెలకొంది. జీహెచ్ఎంసీ అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమల వ్యాప్తిని నివారిద్దాం



బోయగూడ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య, ఎంటమాలజీ సిబ్బంది



బొల్లారంలో ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది



రాంగోపాల్‌పేట్‌లో..

పద్మారావునగర్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక మలేరియా వ్యాధి నుండి మనన్ని మనం కాపాడుకోవడంతో పాటుగా దోమలను నివారించడంలో ప్రజలు జాగ్రత్త వహించాలని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఏఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోయగూడలోని ఐడీహెచ్ కాలనీ ఆరోగ్య కేంద్రం వద్ద నుండి ఎంటమాలజీ విభాగం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రై డే పేరుతో తాము ప్రజా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోయగూడ ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బొల్లారంలో...

తిరుమలగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున, మెడికల్ అధికారి ప్రేమ సుందరి, పద్మ, బాలమణి, మలేరియా సూపర్‌వైజర్ జయాకర్ జేమ్స్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):

మలేరియా నిర్మూలన లక్ష్యాన్ని చేరుకుందామంటూ పాన్ బజార్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శ్రుతి, పీహెచ్ఎన్ ప్రమీల, ఏఎన్ఎం వాణి, స్వర్ణలత పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో...

బౌద్ధనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్‌లో జీహెచ్ఎంసీ ఎంటామాలాజీ విభాగం అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జీహెచ్ఎంసీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పలు వీధుల్లో తిరుగుతూ దోమల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటమాలాజీ అధికారులు దుర్గా ప్రసాద్, జి.చంద్రశేఖర్, శంకర్, కేవీ రాణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

బిట్స్‌పిలానీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సైదయ్య కథనం ప్రకారం.. జవహర్‌నగర్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎలుక ఉపేందర్‌రెడ్డి అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేశారు. దాదాపు 18 లక్షల అప్పు తీసుకువచ్చాడు. దీంతో అప్పులకు మిత్తిలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 24వ తేదీన కుటుంబ సభ్యులు నిద్రపోయిన తర్వాత బయటకు వచ్చి పురుగుల మందు తాగాడు.

ఈ విషయాన్ని తల్లికి చెప్పగా వారు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడని తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నూతన వరుడు మృతి



నవీన్ (ఫైల్)

అడ్డగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పన్నెండు రోజుల క్రితమే పెళ్లయిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ధూలపల్లి ప్రాంతానికి చెందిన సీహెచ్ నవీన్ (27) శంకర బిల్డింగ్స్ ప్రొడక్ట్ లిమిటెడ్ (స్టీల్ కంపెనీ)లో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13న శ్రీకాకుళం యువతితో అతడికి పెండ్లి జరిగింది. గురువారం చిలకలగూడలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి అర్ధరాత్రి వైఎంసీఏ ఫ్లైఓవర్ బ్రిడ్జి పై నుంచి యాక్టీవా పై వెళుతున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఇనుప స్థంభాన్ని ఢీకొనడంతో బలమైన గాయాలతో కింద పడిపోయాడు. గోపాలపురం పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధృవీకరించారు. విషయాన్ని మృతుడి బంధువు చిచుల శ్రీనాథ్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తల్లీ కుమారుడు అదృశ్యం



అంజలి,భార్గవ్ (ఫైల్‌ఫొటోలు)

బౌద్ధనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి వెళ్లిన ఓ తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండిలో నివసించే టి.నందు భార్య తల్లం అంజలి(48), కుమారుడు తల్లం భార్గవ్ (24) ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నందు భార్య, కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావటంతో వారి కోసం పలు చోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తన భార్య, కుమారుడు కనిపించడం లేదని గురువారం రాత్రి భర్త చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సీతాఫల్‌మండి చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుల వివరాలను సేకరిస్తున్న ఫోరం సభ్యులు

తెలంగాణ ఉద్యమకారుల వివరాల సేకరణ

బౌద్ధనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల వివరాల సేకరణ నిర్వహించారు. పలువురు ఉద్యమకారుల నుండి వివరాలను సేకరించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు, 654 మండలాల్లో ఉద్యమకారుల వివరాల సేకరణ చేపట్టామని పలువురు ఉద్యమకారులు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ గుండు దయానంద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండస్వామి, ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న శ్యామ్‌కుమార్

పెద్దకమేలాలో ఉచిత వైద్య శిబిరం

తిరుమలగిరి, ఏప్రిల్, 25 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దకమేలాలో కంటోన్మెంటు బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ సమక్షంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డయాబెటిస్ నియంత్రణ, రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, దీర్ఘకాలిక జ్వరం, మోకాళ్ల నొప్పులు, ఆస్తమా, మైగ్రెయిన్ లాంటి రోగాలకు సీనియర్ వైద్యులు, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మానవహారం, ఎల్లమ్మ తల్లికి వినతిపత్రం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె 7వ రోజులో భాగంగా శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలోని లేడీస్ హాస్టల్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై మానవహారం నిర్వహించి తమ నిరసన తెలిపారు. పక్కనే ఉన్న ఎల్లమ్మతల్లి గుడికి వెళ్లి అధికారులు ఎవరూ తమకు సహకరించడంలేదని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించే విధంగా దీవించాలని అమ్మవారికి వినతిపత్రం అందజేశారు.

ఉగ్రవాదం నశించాలి.. తీవ్రవాదులను శిక్షించాలి

- మోదీజీ బదలాలో హమ్ తుమ్హారే సాథ్ హై
- ర్యాలీ పొడవునా భారత్ మాతా కీ జై..
- అంటూ ముక్తకంఠంతో నినాదాలు



సికింద్రాబాద్ సివిల్ కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



రాంగోపాల్‌పేట్‌లో క్యాండిల్ ర్యాలీలో కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ శ్రేణులు



వారాసిగూడ చౌరస్తాలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మారేడుపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిని ఖండిస్తూ, మరణించిన వారి ఆత్మశాంతి కోసం మారేడుపల్లిలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. వార్డు 4 ఏటీసీ రోడ్డులోని స్నాప్ ఆండ్ గో బేకరి నుండి ప్రారంభమైన ర్యాలీ పికెట్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా జూబ్లీ బస్టాప్ దగ్గరలోని వివేకానంద విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీ పొడవునా భారత్ మాతా కీ జై.. ఉగ్రవాదం నశించాలి.. తీవ్రవాదులను శిక్షించాలి.. మోదీజీ బదలాలో హమ్ తుమ్హారే సాథ్ హై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం వివేకానంద విగ్రహం వద్ద మరణించిన వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కంటోన్మెంట్ మాజీ బోర్డు నామినేటెడ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు మహిళా నాయకులు హిందూ సంఘాలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

సికింద్రాబాద్ సివిల్ కోర్టులో..

అడ్డగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని కోరుతూ, మృతులకు సంతాపం తెలుపుతూ సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో కొవ్వొత్తులు వెలిగించి బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, వినోద్ కుమార్, మహేశ్వరీ, అనిత, మాజీ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్, ఉపాధ్యక్షుడు టీవీ రమణ, కొమురయ్యతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్‌లో...

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడికి నిరసనగా ఎంజీ రోడ్డు మహాత్మా గాంధీ విగ్రహం నుండి సుభాష్ రోడ్డు, బాటా, ప్యాట్నీ సెంటర్, ఎస్‌డీ రోడ్డుల మీదుగా ప్యారడైజ్ వరకు భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, నిర్మల, నితేష్ బోలేలతో పాటు జాతీయ పతాకాలతో ర్యాలీలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

వారాసిగూడలో...

బౌద్ధనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిని నిరసిస్తూ బౌద్ధనగర్ నుండి వారాసిగూడ చౌరస్తా వరకు బీజేపీ నాయకులు శాంతి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్, కన్వీనర్ కందాడి నాగేశ్వర రెడ్డి, కనకట్లహరి, భాస్కరగిరి, కొమరయ్య, సంపత్ పాల్గొన్నారు.

మెట్టుగూడలో...

చిలకలగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుండి స్కైలాబ్ హోటల్ వరకు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆర్.కృష్ణ బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బేగంపేట, సనత్‌నగర్ డివిజన్‌లో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు వెల్లాల రామ్మోహన్, సుబ్బారావు, రవిచంద్ర, అనురాధ



కొవ్వొత్తుల ర్యాలీలో మెట్టుగూడ కార్పొరేటర్ సునీత



కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు